సాక్షి
కుమురం భీం
7
మంగళవారం : 3 : సెప్టెంబర్ : 2024

'పొలాల' సంబరాలు

ఆసిఫాబాద్‌: జిల్లాలో పొలాల అమావాస్య వేడుకలు సోమవారం భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. రైతులు తమ ఎద్దులను రంగులతో అలంకరించారు. ప్రత్యేకంగా తయారు చేసిన నైవేద్యాలు సమర్పించారు. సాయంత్రంమేళ తాళాలు, డప్పు చప్పుళ్లతో ఎద్దులను ఊరేగించారు. అంకమరాజు సమాధి మందిరం, పోచమ్మ ఆలయంతోపాటు పలు ఆలయాల చుట్టూ ప్రదక్షిణ చేశారు.



న్యూస్‌రీల్‌

ఓపెన్‌ డిగ్రీలో ప్రవేశానికి గడువు పొడిగింపు

కాగజ్‌నగర్‌ రూరల్‌: డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌ ఓపెన్‌ యూనివర్సిటీలో 2024–25 విద్యాసంవత్సరానికి గానూ డిగ్రీలో ప్రవేశానికి గడువు పొడిగించినట్లు ప్రభుత్వ డిగ్రీ కళాశాల స్టడీ సెంటర్‌ కోఆర్డినేటర్‌ తూడూరు దత్తాత్రేయ తెలిపారు. ఇంటర్‌ లేదా తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణులైన విద్యార్థులు బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సుల్లో ప్రవేశానికి ఈనెల 30 వరకు గడువు పొడిగించినట్లు ఆయన పేర్కొన్నారు.

నేడు ఎస్సీ కమిషన్‌ సభ్యుడి రాక

ఆసిఫాబాద్‌అర్బన్‌: షెడ్యూల్‌ కులాల జాతీయ కమిషన్‌ సభ్యులు వడ్డేపల్లి రాంచందర్‌ నేడు జిల్లాకు రానున్నట్లు కలెక్టర్‌ వెంకటేష్‌ దోత్రె సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 11 గంటలకు డైరెక్టర్‌ సునీల్‌ కుమార్‌బాబు, రీసెర్చ్‌ అధికారి వరప్రసాద్‌, క్రాంతికుమార్‌లతో కలిసి జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌కు రానున్నట్లు ఆయన పేర్కొన్నారు. సంబంధిత శాఖల అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలతో సిద్ధంగా ఉండాలని సూచించారు.

'కుల గణన చేపట్టాకే ఎన్నికలు నిర్వహించాలి'

ఆసిఫాబాద్‌అర్బన్‌: రాష్ట్రంలో కుల గణన చేపట్టాకే ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు రూప్‌నర్‌ రమేశ్‌ డిమాండ్‌ చేశారు. పంచాయతీ ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలనే డిమాండ్‌తో సోమవారం కలెక్టరేట్‌ ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కాంగ్రెస్‌ అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో సమగ్ర కుల గణన చేపడుతామని హామీ ఇచ్చి నేటికీ ప్రారంభించకపోవడం సరికాదన్నారు. వెంటనే కుల గణన చేపట్టాలని, లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు బాలేశ్‌, ప్రధాన కార్యదర్శి గాజుల జక్కయ్య, రైతు సంఘం ప్రధాన కార్యదర్శి గడ్డల శంకర్‌, నాయకులు మారుతి పటేల్‌, లోబడే లహు కుమార్‌, నాగేషే శంకర్‌, గుర్నులే మారుతి, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో వసతులు కల్పించాలి



అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్‌ దీపక్‌ తివారి

పెంచికల్‌పేట్‌: అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకుని రావాలని జిల్లా అదనపు కలెక్టర్‌ (స్థానిక సంస్థలు) దీపక్‌ తివారి అన్నారు. మండలంలోని పోతెపల్లి అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆదివారం సందర్శించారు. తాగునీరు, విద్యుత్‌, మరుగుదొడ్లను నిర్మించాలని సూచించారు. గొంట్లపేట్‌ అంగన్‌వాడీ కేంద్రానికి పక్కా భవనం మంజూరు చేయాలని గ్రామస్తులు కోరారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో కొనసాగుతున్న పంచాయితీ వార్డుల మ్యాపింగ్‌ కార్యక్రమాన్ని, పెద్దవాగు వంతెన సమీపంలో కుంగిన అప్రోచ్‌ రోడ్డును పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్‌ వెంకటేశ్వర్‌ రావు, ఎంపీడీవో అల్బర్ట్‌, తదితరులు ఉన్నారు.

లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

దహెగాం: జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాలతో వాగులు, ఒర్రెలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయని లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అదనపు కలెక్టర్‌ దీపక్‌ తివారి అన్నారు. సోమవారం పెద్దవాగు, పెసరికుంట గ్రామాన్ని సందర్శించారు. పెసరికుంటలో వరద ప్రభావం ఉన్న కుటుంబాలని బీబ్రా రైతు వేదికలో పునరావాసం కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట ఎంపీడీవో రాజేందర్‌, డీటీ లలిత, ఐకేపీ ఏపీఎం చంద్రశేఖర్‌, ఈజీఎస్‌ ఏపీవో కల్పన, తదితరులు ఉన్నారు.

'చింతలమాదర'కు అనుమతి లేదు

తిర్యాణి: ఇటీవల కురుస్తున్న వర్షాలకు మండలంలోని చింతలమాదర జలపాతానికి వరదనీరు పోటెత్తుతోంది. ఈ నేపథ్యంలో నీటి ప్రవాహం కొంత తగ్గే వరకు జలపాత వీక్షణకు సందర్శకులకు అనుమతి లేదని ఏకో టూరిజం కమిటీ చైర్మన్‌ తుంరం గోపాల్‌ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరిగి ప్రకటన చేసేంత వరకు సందర్శకులెవరూ జలపాతం వద్దకు రావద్దని సూచించారు.

కరువు తీరేలా..



కుమురంభీం ప్రాజెక్టు ఐదు గేట్లు తెరిచి వదులుతున్న నీరు

- ఆగస్టులో కురిసిన భారీ వర్షాలు
- నిండుకుండలా చెరువులు, ప్రాజెక్టులు
- సాగుకు ఇబ్బంది లేదంటున్న అన్నదాతలు
- ఎనిమిది మండలాల్లో అధిక వర్షపాతం

జిల్లాలోని ప్రాజెక్టుల్లో నీటిమట్టం వివరాలు

ప్రాజెక్టు	నీటి సామర్థ్యం	ప్రస్తుత నీటినిల్వ	ఇన్‌ఫ్లో	ఔట్‌ఫ్లో
కుమురంభీం	10.393 టీఎంసీలు	5.688 టీఎంసీలు	12,580 క్యూసెక్కులు	10,485 క్యూసెక్కులు
వట్టివాగు	2.890 టీఎంసీలు	2.442 టీఎంసీలు	5,470 క్యూసెక్కులు	5,160 క్యూసెక్కులు
చెలిమెల	326 మీటర్లు	326 మీటర్లు	155 క్యూసెక్కులు	155 క్యూసెక్కులు
పీపీరావు	147.5 మీటర్లు	147 మీటర్లు	1,488 క్యూసెక్కులు	1,488 క్యూసెక్కులు

దహెగాం: వర్షాకాలం ఆరంభంలో వరుణుడి జాడ లేక పూజలు చేసిన సందర్భాలున్నాయి. జూన్‌లో వర్షాల జాడలేదు. జూలైలో మోస్తరుగా కురిశాయి. ఆగస్టు మాసంలో అతి నుంచి భారీ వర్షాలు కురిశాయి. దీంతో చెరువులు, ప్రాజెక్టుల్లో జలకళ సంతరించుకుంది. జూన్‌ నుంచి సెప్టెంబరు 2 వరకు సాధారణ కంటే అధిక వర్షపాతం నమోదైంది. ఈ ఏడాది వర్షాకాలం ప్రారంభమైనప్పటి నుంచి ఏ మండలంలో కూడా లోటు వర్షపాతం లేదని అధికారులు పేర్కొంటున్నారు. జిల్లా వ్యాప్తంగా 865.0 మిల్లీ మీటర్ల వర్షం కురవాల్సి ఉండగా సగటున 1,025.3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. దీంతో సాగుకు ఎలాంటి ఢోకా లేదని వ్యవసాయశాఖ అధికారులు పేర్కొంటున్నారు.

నిండుకుండలా ప్రాజెక్టులు, చెరువులు..

జిల్లా వ్యాప్తంగా రెండు రోజులుగా భారీ వర్షాలు కురుస్తుండడంతో ప్రాజెక్టులు, చెరువులు నిండుకుండలను తలపిస్తున్నాయి. జిల్లాలో కుమురంభీం, వట్టివాగు, చెలిమెల, బొక్కివాగు, పీపీరావు ప్రాజెక్టులు, 563 చెరువులు ఉన్నాయి. వాటిలో భారీగా వరద నీరు వచ్చి చేరడంతో ప్రాజెక్టుల గేట్లు ఎత్తి నీటిని దిగువకు వదులుతున్నారు. జలాశయాల్లోని వరద మత్తడి పైనుంచి అలుగుపోస్తోంది. వాగులు, ఒర్రెలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి.

వరినాట్లు పూర్తి..

వానాకాలం సీజన్‌ ప్రారంభంలో వర్షాలు సమృద్ధిగా కురియకపోవడంతో వరి నారుమడులు ఆలస్యమయ్యాయి. బోర్లు, బావులు ఉన్న వారు మాత్రమే ఆగస్టు మొదటి వారంలోపే నాట్లు పూర్తి చేశారు. జూలై చివరి వారం నుంచి ఆగస్టు వరకు వర్షాలు సమృద్ధిగా కురియడంతో వారం రోజుల క్రితం వరినాట్లు పూర్తయ్యాయి. జిల్లాలో సుమారు 50 వేల ఎకరాల్లో వరి సాగుచేస్తున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు వరి, పత్తి పంటలకు మేలు జరుగుతుందని అన్నదాతలు పేర్కొంటున్నారు. ప్రస్తుతం రైతులు వరికి ఎరువులు వేసే పనిలో నిమగ్నమయ్యారు. వర్షాల కారణంగా పత్తికి తెగుళ్లు సోకకుండా క్రిమిసంహారక మందులు పిచికారీ చేస్తున్నారు. జిల్లాలో పత్తి, వరిపంటలు ఆశాజనకంగానే ఉన్నాయి. కానీ పెద్దవాగులోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతుండడంతో పరీవాహక ప్రాంతాల్లోని పంటలు నీటమునిగే ప్రమాదముందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

జిల్లాలో జూన్‌ నుంచి సెప్టెంబర్‌ 2 వరకు కురిసిన వర్షపాతం(మి.మీలలో)

మండలం	కురవాల్సిన వర్షం	కురిసిన వర్షం	అధికం
జైనూర్‌	923.3	1,096.6	19.0
సిర్పూర్‌(యు)	879.9	895.2	2.0
లింగాపూర్‌	833.3	1,025.0	23.0
తిర్యాణి	765.0	827.0	8.0
రెబ్బెన	752.5	773.6	3.0
ఆసిఫాబాద్‌	793.3	872.6	10.0
కెరమెరి	756.3	923.6	22.0
వాంకిడి	828.4	1,008.7	22.0
కాగజ్‌నగర్‌	811.9	941.0	16.0
సిర్పూర్‌(టి)	928.0	1,114.9	20.0
కౌటాల	914.7	1,166.3	28.0
చింతలమానెపల్లి	934.5	1,272.4	36.0
బెజ్జూర్‌	984.3	1,188.5	21.0
పెంచికల్‌పేట్‌	919.0	1,203.8	31.0
దహెగాం	949.9	1,068.8	13.0

జిల్లా వ్యాప్తంగా 865.0 మిల్లీ మీటర్ల వర్షం కురవాల్సి ఉండగా 1025.3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. సాధారణం 19.0 మిల్లీమీటర్లు నమోదైంది. జిల్లాలోని ఏ మండలంలో కూడా లోటు వర్షపాతం లేదు. ఎనిమిది మండలాల్లో అధిక వర్షపాతం నమోదైంది. దీంతో భూగర్భ జలాలు సైతం పెరుగుతాయని, రబీ సాగుకు సైతం ఎలాంటి ఇబ్బందులు ఉండవని అధికారులు పేర్కొంటున్నారు.

వైఎస్సార్‌ అంటేనే ఓ భరోసా...!



వైఎస్సార్‌ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

- కాంగ్రెస్‌ నియోజకవర్గ ఇన్‌చార్జి అజ్మీరా శ్యాంనాయక్‌
- ఘనంగా వైఎస్సార్‌ వర్ధంతి

ఆసిఫాబాద్‌అర్బన్‌: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ మాజీ ముఖ్యమంత్రి, దివంగత నేత డాక్టర్‌ వైఎస్‌ రాజశేఖరరెడ్డి అంటేనే ఓ నమ్మకం.. భరోసా.. దిక్కులేని వారు, అన్నార్తులకు ఆపన్నహస్తం, పేద విద్యార్థుల పాలిట ఓ వరమని, ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన మహా నాయకుడని కాంగ్రెస్‌ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి అజ్మీరా శ్యాంనాయక్‌ అన్నారు. వైఎస్సార్‌ 15వ వర్ధంతిని సోమవారం జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 108, ఆరోగ్యశ్రీ ద్వారా ఎంతోమంది ప్రాణాలు కాపాడి ప్రాణదాతగా నిలిచారన్నారు. ఎంతోమంది పేద విద్యార్థులకు ఉన్నతవిద్యను దరిచేర్చిన విద్యాదాత అన్నారు. వైఎస్సార్‌ హయాంలో రూపుదిద్దుకున్న ప్రాజెక్టులు జలకళ సంతరించుకున్నాయన్నారు. కార్యక్రమంలో నాయకులు జక్కన్న, వైరాగడె మారుతిపటేల్‌, నిజాం, నాగోసే శంకర్‌, తనాజి, బాలేష్‌, మిలింద్‌, తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ దండె విఠల్‌

కాగజ్‌నగర్‌ రూరల్‌: పట్టణంలో ఉమ్మడి ఆదిలాబాద్‌ జిల్లా ఎమ్మెల్సీ దండె విఠల్‌ ఆధ్వర్యంలో వైఎస్సార్‌ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. వైఎస్సార్‌ సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీచైర్మన్‌ సిడాం గణపతి, టీపీసీసీ కార్యదర్శి అర్షద్‌ హుస్సేన్‌, మాజీ జెడ్పీటీసీ పిల్లల తిరుపతి, నాయకులు శరత్‌, మహేశ్‌, మురళీగౌడ్‌, షబ్బీర్‌ హుస్సేన్‌, ఆర్‌ఎంపీల సంఘం జిల్లా కార్యదర్శి మిరాజ్‌ హుస్సేన్‌, తదితరులు పాల్గొన్నారు.

అదే జోరు

- జైనూర్‌లో 158.3 మిల్లీ మీటర్ల వర్షపాతం
- వరద ప్రాంతాలను పరిశీలించిన కలెక్టర్‌ వెంకటేశ్‌ దోత్రే

ఆసిఫాబాద్‌/ఆసిఫాబాద్‌రూరల్‌/కౌటాల/సిర్పూర్‌(టి): ఉత్తర బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండంతో జిల్లాలో మూడో రోజు సైతం భారీ వర్షం కురిసింది. ఆసిఫాబాద్‌ మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే రహదారిలో కల్వర్టులు తెగిపోవడంతో రాకపోకలు నిలిచిపోయాయి. కుమురంభీమ్‌ ప్రాజెక్టు 5 గేట్లు, వట్టివాగు ప్రాజెక్టు 2 గేట్లు ఎత్తి వేశారు. కౌటాల మండలంలోని తుమ్మిడిహెట్టి వద్ద గల ప్రాణహిత నది వరదనీటితో పరవళ్లు తొక్కుతోంది. తాటిపెల్లి వద్ద వార్ధా నది, గుండాయిపేట గ్రామానికి సరిహద్దులోని పెన్‌గంగ నదులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. తుంపెల్లి వాగుపై ఉన్న కల్వర్టు కొట్టుకుపోయింది. మాలన్‌గోంది(కొలాంగూడ), గోండుగూడ గ్రామాల మధ్య వంతెన వద్ద రోడ్డు కొట్టుకుపోవడంతో ఆయా గ్రామాల ప్రజలకు జిల్లా కేంద్రానికి రాకపోకలు నిలిచిపోయాయి. కలెక్టర్‌ వెంకటేశ్‌ దోత్రే, తహసీల్దార్‌ రోహిత్‌ దేశ్‌పాండే, ఎంపీడీవో శ్రీనివాస్‌తో కలిసి పరిస్థితి పరిశీలించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జైనూర్‌లో అత్యధికంగా 158.3 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. సిర్పూర్‌(యూ) 90.5, గిన్నెధరి 87.8, తిర్యాణి 67.3, ధనోరా 64.3, రెబ్బెన 62.5, లింగాపూర్‌ 54.5, కెరమెరి 51.5, ఆసిఫాబాద్‌ 45 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది.



ఆసిఫాబాద్‌ మండలం మాలన్‌గోంది రహదారిపై తెగిన కల్వర్టును పరిశీలిస్తున్న కలెక్టర్‌

విద్య ప్రాముఖ్యతను తెలియజేయాలి



మొబైల్‌ రీడింగ్‌ లైబ్రరీని ప్రారంభిస్తున్న కలెక్టర్‌ వెంకటేశ్‌దోత్రే, ఎస్పీ శ్రీనివాసరావు, అదనపు కలెక్టర్‌

- కలెక్టర్‌ వెంకటేశ్‌ దోత్రే

ఆసిఫాబాద్‌అర్బన్‌/ఆసిఫాబాద్‌రూరల్‌: సమాజానికి విద్య ప్రాముఖ్యతను తెలియజేస్తూ విద్యార్థులకు అవసరమైన మెటీరియల్‌ను అందుబాటులో ఉంచేందుకు మొబైల్‌ రీడింగ్‌ లైబ్రెరిని ఏర్పాటు చేయడం జరిగిందని కలెక్టర్‌ వెంకటేష్‌ దోత్రె అన్నారు. సోమవారం కలెక్టరేట్‌ ఆవరణలో రీడింగ్‌ క్యాంపెయిన్‌ ప్రోగ్రాంలో భాగంగా మొబైల్‌ రీడింగ్‌ లైబ్రరీ వాహనాన్ని అదనపు కలెక్టర్‌ దీపక్‌ తివారితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ మాట్లాడుతూ జిల్లాలోని 15 మండలాల్లో సమాజానికి, పిల్లలకు చదువు ప్రాముఖ్యతను తెలియజేయడం, 3 నుండి 8 సంవత్సరాల పిల్లలకు ప్రారంభ దశలో పుస్తకాలు చదవడం ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించడం జరుగుతుందన్నారు. రకరకాల పుస్తకాలు, పోస్టర్లు, స్టోరీ కార్డ్స్‌, బిగ్‌ బుక్స్‌, ప్రింట్‌ రిచ్‌ ఎన్విరాన్మెంట్‌ పుస్తకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ మొబైల్‌ వాహనం జిల్లాలో ఏడు రోజుల పాటు అన్ని గ్రామాల్లో తిరుగుతుందని, వందలాది పుస్తకాలు ఈ వాహనంలో అందుబాటులో ఉంటాయని, ప్రతి ఒక్కరూ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డీఈవో అశోక్‌, క్వాలిటీ కోఆర్డినేటర్‌ శ్రీనివాస్‌, రూమ్‌ టు రీడ్‌ ఇండియా జిల్లా లీడ్‌ జెన్నిఫర్‌ పాల్గొన్నారు.

పండుగలు శాంతియుతంగా జరుపుకోవాలి

ఆసిఫాబాద్‌: పండుగలు శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని కలెక్టర్‌ వెంకటేశ్‌ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌ సమావేశ మందిరంలో సోమవారం ఎస్పీ డివి శ్రీనివాసరావు, అదనపు కలెక్టర్‌ దాసరి వేణు, ఆర్డీవోలు లోకేశ్వర్‌ రావు, సురేశ్‌, డీఎస్పీలు సదయ్య, కరుణాకర్‌, డీపీవో బిక్షపతి గౌడ్‌లతో కలిసి శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. వినాయక చవితి, మిలాద్‌ ఉన్‌నబి పండగలను మత సామరస్యంతో జరుపుకోవాలని సూచించారు.

లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ వేగవంతం చేయాలి

ప్రధానమంత్రి విశ్వకర్మ పథకం లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ వేగవంతం చేయాలని కలెక్టర్‌ వెంకటేశ్‌ దోత్రే అన్నారు. సోమవారం కలెక్టరేట్‌ సమావేశ మందిరంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ మాట్లాడుతూ పథకంలో భాగంగా చేతి వృత్తుల వారు రూ.2,223 మంది దరఖాస్తు చేసుకోగా 698 మందిని శిక్షణ కోసం పంపించామని, పెండింగ్‌లో ఉన్న మిగితా 1,393 మంది దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ వేగవంతం చేయాలని సూచించారు.

రైతులకు అండగా ఉంటాం

కౌటాల: భారీ వరదలో పంటలు నీట మునిగిన రైతులకు అధికార యంత్రాంగం అండగా ఉంటుందని కలెక్టర్‌ వెంకటేశ్‌ దోత్రే అన్నారు. సోమవారం కౌటాల మండలం వీర్దండి గ్రామంలో నీటమునిగిన పంటలను పరిశీలించారు. పంట నష్టాన్ని పూర్తిస్థాయిలో అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. ఆయన వెంట కాగజ్‌నగర్‌ మార్కెట్‌ కమిటీ చైర్మన్‌ సిద్దల దేవయ్య ఉన్నారు.

ప్రజారక్షణకు అధికార యంత్రాంగం పనిచేయాలి

ఆసిఫాబాద్‌రూరల్‌: ప్రజారక్షణకోసం అధికార యంత్రాంగం పనిచేయాలని కలెక్టర్‌ వెంకటేశ్‌ దోత్రే అన్నారు. సోమవారం మాలన్‌ గొంది, తుంపెల్లి, గోండుగూడ, శేఖన్‌ గొంది రోడ్లను పరిశీలించి మరమ్మతు చేయించాలని పంచాయతీ రాజ్‌ ఈఈని ఆదేశించారు. ఆయన వెంట ఎమ్మార్వో రోహిత్‌ దేశ్‌ పాండే, ఎంపీడీవో శ్రీనివాస్‌ ఉన్నారు.

పేకాట కేరాఫ్‌ కాగజ్‌నగర్‌..

- మూడు ముక్కలాటకు ప్రత్యేక క్లబ్బులు
- రేయింబవళ్లు పేకాట నిర్వహణ
- ఆటగాళ్లకు సకల సదుపాయాలు
- నిర్వాహకులకు నేతల అండదండలు



సాక్షి, ఆసిఫాబాద్‌: సాధారణంగా పెళ్లిళ్లు, ఇతర శుభకార్యాలకు గుంపులు గుంపులుగా ఆహ్వానితులు తరలిరావడం మనం చూస్తుంటాం. కాగజ్‌నగర్‌లో పేకాటకోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన క్లబ్బుల్ని మాత్రం చూడగానే ఆకట్టుకునేలా సిద్ధం చేయడంతో పాటు 'పేకాడదాం రండి..' అన్నట్లుగా ప్రత్యేక ఆహ్వానాలు కూడా పంపిస్తుండటంతో ఆ క్లబ్బులు రేయింబవళ్లు పేకాటరాయుళ్లతో కిటకిటలాడటం గమనార్హం. గత ప్రభుత్వ పాలనలో ఇక్కడ ఆ నిర్వాహకులు ఆడిందే ఆట అన్నట్లుగా సాగగా.. తాజాగా ఆదివారం రాత్రి ఓ ఇంట్లో పేకాడుతున్న సమాచారంతో స్థానిక పోలీసులు దాడులు చేసి నిర్వాహకుడితో సహా ఎనిమిది మందిని అరెస్టు చేయడం పట్టణంలో కలకలం రేపుతోంది. అరెస్టయిన వారిలో కాగజ్‌నగర్‌, ఆసిఫాబాద్‌, మంచిర్యాల నియోజకవర్గాలకు చెందిన కొందరు ప్రముఖులు ఉండటమే ఇందుకు కారణమైంది.

అన్ని హంగులతో ఏర్పాట్లు...

రంగు రంగుల విద్యుద్దీపాలు.. ఖరీదైన మద్యం... అధునాతన సౌండ్‌ సిస్టం.. సహాయకులు... ఇవీ కాగజ్‌నగర్‌లో పేకాట క్లబ్బుల్లో ఉన్న హంగులు. రాజధానిస్థాయి ఏర్పాట్లు ఉండటంతో ఇక్కడికి జిల్లాతో పాటు పొరుగున ఉన్న జిల్లాల నుంచి కూడా పేకాటరాయుళ్లు 'క్యూ' కడుతున్నారు. ఆర్థిక స్థితి ఆధారంగా కస్టమర్లను ప్రత్యేక కేటగిరీలుగా విభజించి క్యాంప్‌లను నిర్వహిస్తున్నారని కాగజ్‌నగర్‌ పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైనట్లు సమాచారం. గేమ్‌ను బట్టి రూ. 4 వేల నుంచి రూ.10 వేల వరకు వసూలు చేస్తున్నట్లు తెలిసింది.

ఎనిమిది మంది అరెస్టు...

కాగజ్‌నగర్‌లోని గుంటూరు కాలనీలో పేకాట నిర్వాహకుడు గజ్జెల శ్రీనివాస్‌ ఇంట్లో పలువురు పేకాడుతున్నట్లు ఆదివారం రాత్రి స్థానిక ఎస్సై దీకొండ రమేశ్‌కు సమాచారం అందడంతో పోలీసులు దాడులు చేసి.. నిర్వాహకుడితో సహా 8 మందిని అరెస్టు చేశారు. వీరిలో కాగజ్‌నగర్‌కు చెందిన గజ్జెల శ్రీనివాస్‌, కె.మధుకర్‌, టి.రఘు, ఆసిఫాబాద్‌ జిల్లా బురుగూడకు చెందిన ఎం.కాశయ్య, మంచిర్యాలకు చెందిన కె.దామోదర్‌, రామకృష్ణాపూర్‌కు చెందిన పి.శ్రీనివాస్‌, వి.శ్రీనివాస్‌ పట్టుబడ్డారు. వారి వద్ద నుంచి 104 ప్లేయింగ్‌ కార్డులను, రూ.43 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు.

ప్రముఖుల కోసం ప్రత్యేకంగా...

కాగజ్‌నగర్‌ పట్టణంలోని గుంటూరు కాలనీలో ఆదివారం రాత్రి పేకాట ఆడుతూ ఎనిమిది మంది పోలీసులకు చిక్కారు. ఈ జాబితాలో ఆసిఫాబాద్‌, కాగజ్‌నగర్‌, మంచిర్యాల నియోజకవర్గాలకు చెందిన ప్రముఖ వ్యాపారులు ఉండడం కలకలం రేపింది. దహెగాం మండలం ఇట్యాల గ్రామానికి చెందిన ప్రస్తుతం కాగజ్‌నగర్‌లోని గుంటూరు కాలనీలో నివాసం ఉంటున్న గజ్జెల శ్రీనివాస్‌ ప్రధాన సూత్రధారిగా గుర్తించారు. ఇతని లీలలు ఒక్కొక్కటిగా బయటికొస్తున్నాయి. ఆసిఫాబాద్‌, మంచిర్యాల జిల్లాలతో పాటు పొరుగున ఉన్న జిల్లాలకు చెందిన పలువురు ప్రముఖులతో నిత్యం టచ్‌లో ఉండేవాడని, గత ప్రభుత్వ హయాంలో ఇతను పలుచోట్ల పేకాట క్లబ్బులు నిర్వహించినట్లు తెలిసింది.

పట్టుబడిన దబ్బెంత?

ఉమ్మడి ఆదిలాబాద్‌ జిల్లాలో పేకాట నిర్వాహకుడిగా పేరున్న గజ్జెల శ్రీనివాస్‌ ఇంట్లో ఆదివారం పోలీసు దాడుల్లో పట్టుబడిన డబ్బెంత? చూపించింది ఎంత? అన్న అనుమానాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. ఎందుకంటే ఆదివారం రోజు పేకాడుతూ పట్టుబడిన ప్రముఖ వ్యాపారులు ఆర్థికంగా బాగా స్థితి గలవారు. ఏ1గా ఉన్న గజ్జెల శ్రీనివాస్‌ వద్ద కేవలం రూ.10 వేలు, ఏ3గా ఉన్న పి.వెంకటేశ్‌ వద్ద రూ.9 వేలు, ఏ2, ఏ7 వద్ద రూ. 5 వేలు చొప్పున మిగిలిన వారిలో ఒకరి వద్ద రూ.2వేలు, ముగ్గురి వద్ద రూ. 4 వేల చొప్పున లభించినట్లు పోలీసులు సీజర్‌ పంచనామాలో పేర్కొన్నారు. అయితే పోలీసులు కేవలం రూ.43 వేలు మాత్రమే పట్టుబడినట్లు చూపడంపై పలు ఆరోపణలు వినిపిస్తున్నాయి. పెద్ద మొత్తంలో డబ్బులు దొరికాయన్న వాదనలు ఉన్నాయి. నిర్వాహకుడు బాగా పలుకుబడిన వ్యక్తి కావడమే కాకుండా అధికారపార్టీ నేతలతో సత్సంబంధాలు కలిగి ఉండటం పలు అనుమానాలకు బలాన్ని చేరుకూరుస్తుండగా.. కాగజ్‌నగర్‌ పోలీసులు సైతం జిల్లా పోలీసు బాస్‌ ఆదేశాల మేరకు నామమాత్రంగా కేసును నమోదు చేసి చేతులు దులుపుకున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గజ్జెల శ్రీనివాస్‌ నిర్వహించే పేకాట క్లబ్బుల్లో నిత్యం రూ.లక్షల్లోనే గేములు జరుగుతాయన్న ప్రచారం ఉంది. ఈ నేపథ్యంలో పోలీసు బాస్‌ అసాంఘిక కార్యకలాపాలపై మరింత సీరియస్‌గా దృష్టి సారించాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

క్లుప్తంగా

కృష్ణ ఎక్స్‌ప్రెస్ రద్దు

ఆదిలాబాద్: భారీ వర్షాల నేపథ్యంలో ఆదిలాబాద్–తిరుపతి మధ్య నడిచే కృష్ణ ఎక్స్‌ప్రెస్ (17206) సర్వీసు రద్దు చేస్తున్నట్లు ద.మ రైల్వే ఓ ప్రకటనలో పేర్కొంది. మంగళవారం ఈ సర్వీసు రద్దు చేసినట్లు తెలిపింది. ఈ విషయాన్ని ప్రయాణికులు గమనించాలని కోరింది.

8 నుంచి డబ్ల్యూపీఎస్ వార్షిక క్రీడలు

రెబ్బెన: డబ్ల్యూపీఎస్ అండ్ జీఏ బెల్లంపల్లి ఏరియా డిపార్టుమెంటల్ అంతర్గత వార్షిక క్రీడాపోటీలను ఈనెల 8 నుంచి ప్రారంభిస్తున్నట్లు ఏరియా జీఎం శ్రీనివాస్ ఓ ప్రకటనలో తెలిపారు. 8న షటిల్ బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్, బాడీ బిల్డింగ్, పవర్, వెయిట్ లిఫ్టింగ్, 9న వాలీబాల్, 10న లాంగ్ టెన్నిస్, 12న బాస్కెట్ బాల్, 15న క్యారమ్స్, చెస్, కల్చరల్, 27న బాల్ బ్యాడ్మింటన్, 28న కబడ్డీ పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. ఏరియాలో పని చేస్తున్న ఉద్యోగులందరూ ఈ క్రీడల్లో పాల్గొనాలని కోరారు.

వుషూ పోటీల్లో భారతికి గోల్డ్‌మెడల్



గోల్డ్‌మెడల్‌తో భారతి

రామకృష్ణాపూర్: అమెచ్యూర్ వుషూ అసోసియేషన్ ఆఫ్ మంచిర్యాల ఆధ్వర్యంలో క్యాతనపల్లిలోని ఎంఆర్ గార్డెన్స్‌లో ఆదివారం నిర్వహించిన వుషూ రాష్ట్ర స్థాయి చాంపియన్‌షిప్ పోటీల్లో మంచిర్యాలకు చెందిన వడ్లకొండ భారతి వుషూ నాన్‌కాన్ కటా విభాగంలో గోల్డ్‌మెడల్ సాధించింది. ఉత్తరఖాండ్ రాష్ట్రంలోని డెహ్రాడూన్‌లో త్వరలో జరుగనున్న జాతీయస్థాయి పోటీల్లో భారతి పాల్గొననున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

పిచ్చికుక్కల దాడిలో యువకుడికి గాయాలు

నెన్నెల: మండలంలోని జెండావెంకటాపూర్‌లో సోమవారం పిచ్చికుక్కల దాడిలో యువకుడు దుర్గం సునీల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. సునీల్ బైక్‌పై గ్రామంలోకి వస్తుండగా కుక్కల గుంపు కొట్లాడుకుంటూ వచ్చి బైక్‌కు తగిలాయి. సునీల్ కింద కాళ్లు పెట్టగా రెండు కుక్కలు అతని కాలిని గాయపర్చింది. అతడిని గ్రామస్తులు మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

కోడిపందేల స్థావరాలపై దాడి

చింతలమానెపల్లి: మండలంలోని ఆడెపల్లి శివారులో నిర్వహిస్తున్న కోడిపందేల స్థావరంపై సోమవారం పోలీసులు దాడులు నిర్వహించారు. 8 మందిని పట్టుకుని, వారి వద్ద నుంచి ఐదు కోడి పుంజులు, ఐదు కత్తులతోపాటు రూ.2120 నగదును స్వాధీనం చేసుకున్నామని ఎస్సై నరేశ్ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

నెన్నెల: మండలంలోని కోణంపేట శివారులో కోడిపందేల స్థావరంపై సోమవారం సాయంత్రం దాడి చేసినట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు. పక్కా సమాచారంతో మేరకు దాడి చేసి కోడి పందేలు కాస్తున్న 8 మందిని అరెస్టు చేశామన్నారు. రెండు పందెం కోళ్లు, రెండు కత్తులు, రూ.5 వేలు స్వాధీనం చేసుకున్నామని ఎస్సై తెలిపారు.

‘ఇన్‌స్పైర్’ చేయండి!

- బాల మేధావులకు చాన్స్!
- పోటీలకు దరఖాస్తుల ఆహ్వానం
- సెప్టెంబర్ 15 తుది గడువు
- ఉమ్మడి జిల్లాలో మంచిర్యాల ఫస్ట్
- ఆదిలాబాద్ జిల్లా లాస్ట్..

జిల్లా	పాఠశాల	లక్ష్యం	దరఖాస్తులు
మంచిర్యాల	280	1400	822
నిర్మల్	244	1220	274
కుమరంభీం	171	855	138
ఆదిలాబాద్	263	1315	19



జపాన్ సకురాకు ఎంపికైన విద్యార్థి ప్రాజెక్ట్‌ను పరిశీలిస్తున్న ప్రభుత్వ సలహాదారు అర్కల వేణుగోపాల్ (ఫైల్)

మంచిర్యాలఅర్బన్: చిట్టి బుర్రకు పదునుపెట్టి వినూత్న ఆలోచనలు చేసేలా, విద్యార్థుల్లో సృజనాత్మకత వెలికితీసేందుకు ప్రభుత్వం 'ఇన్‌స్పైర్ మనక్'పేరిట విజ్ఞాన మేళా నిర్వహిస్తోంది. ఏటా కేంద్రశాస్త్ర సాంకేతిక మంత్రిత్వమండలి నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ సంయుక్తంగా ఇన్‌స్పైర్ మనక్ పేరిట ప్రతిపాదనలు పంపిస్తోంది. ఇన్‌స్పైర్ పోటీలకు 2024–25 విద్యా సంవత్సరానికి సెప్టెంబర్ 15 వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్, కస్తూర్బా, గురుకుల విద్యాలయాల్లో 6 నుంచి 10వ తరగతి చదువువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రతి పాఠశాల నుంచి ఐదు ప్రాజెక్టులు పంపించాలి. ఇదిలా ఉంటే మంచిర్యాల జిల్లా 822 ప్రాజెక్టుల నమోదుతో మొదటి స్థానంలో నిలవగా, ఆదిలాబాద్ జిల్లా 19 దరఖాస్తులతో వెనకబడిపోయింది.

పాఠశాలకు ఐదు చొప్పున..

6 నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఇన్‌స్పైర్ పోటీలకు అర్హులు. ప్రతి పాఠశాల నుంచి తరగతి ఒకటి చొప్పున ఐదు ప్రాజెక్టులు తయారు చేయాలని డీఈవో ఆదేశాలు జారీ చేశారు. లక్ష్యానికి దూరంగా ఉండటంతో ఇటీవల హెచ్ఎంల సమావేశంలో ఈనెల 30లోగా ప్రాజెక్టులన్నీ అప్‌లోడ్ చేయాలని సూచించారు. విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులను నిపుణులు పరిశీలించి జిల్లాస్థాయి ప్రదర్శనకు ఎంపిక చేస్తారు. ఇలా ఎంపికైన ఒక్కో ప్రాజెక్ట్‌కు రూ.10 వేల చొప్పున ప్రోత్సాహం విద్యార్థి బ్యాంకు ఖాతాలో జమచేస్తారు. ఈ విద్యా సంవత్సరం అక్టోబర్‌లో జిల్లాస్థాయి ఇన్‌స్పైర్ ప్రదర్శన ఉంటుంది. ప్రతిభ కనబర్చిన విద్యార్థి ప్రాజెక్టు రాష్ట్రస్థాయి, జాతీయ స్థాయికి ఎంపికచేస్తారు. రాష్ట్రస్థాయిలో ప్రతిభ చాటి జాతీయస్థాయికి ఎంపికైతే రూ.25 వేలు, అక్కడ ప్రతిభ చూపితే రాష్ట్రపతి భవన్, జపాన్ సందర్శనకు అవకాశం కల్పించే వీలుంది.

గత విద్యాసంవత్సరంలో..

2023–24 విద్యాసంవత్సరానికి మంచిర్యాల జిల్లా నుంచి 1235 ప్రాజెక్టుల నామినేషన్ నమోదు చేయగా 149 ఎంపికయ్యాయి. కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లా 812 ప్రాజెక్టులకు గాను 108, నిర్మల్‌లో 1322 ప్రాజెక్టులకు గాను 125 ఎంపికయ్యాయి. ఆదిలాబాద్ జిల్లా 676 ప్రాజెక్టుల్లో 66 మాత్రమే ఎంపికై చివరి స్థానంలో నిలిచింది.

విద్యార్థులను ప్రోత్సహించాలి

2024–25 సంవత్సరానికి ఇన్‌స్పైర్ పోటీలకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలి. ఈనెల 15 వరకు తుది గడువు ఉంది. నిర్దేశిత లక్ష్యం చేరుకునేలా ఉపాధ్యాయులు విద్యార్థులను ప్రోత్సహించాలి. కొత్త ఆవిష్కరణలకు ప్రాధాన్యత ఇచ్చేలా చొరవ చూపాలి.– యాదయ్య, డీఈవో, మంచిర్యాల

ఖాళీలతో సంబంధం లేకుండా ప్రమోషన్లు కల్పించాలి



జీఎంకు వినతిపత్రం ఇస్తున్న ఏఐటీయూసీ నేతలు

రెబ్బెన(ఆసిఫాబాద్): సింగరేణిలో ఈపీ ఆపరేటర్లకు ఖాళీలతో సంబంధం లేకుండా పరీక్షలకు హాజరైన ఈపీ ఆపరేటర్లందరికీ ప్రమోషన్లు కల్పించాలని ఏఐటీయూసీ గోలేటి బ్రాంచి కార్యదర్శి ఎస్.తిరుపతి డిమాండ్ చేశారు. సోమవారం గోలేటి టౌన్‌షిప్‌లోని జీఎం కార్యాలయంలో జీఎం శ్రీనివాస్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈపీ ఆపరేటర్ల ప్రమోషన్ల విషయంలో యాజమాన్యం అన్యాయం చేసిందన్నారు. శ్రీరాంపూర్ నుంచి బెల్లంపల్లి ఏరియా వరకు తక్కువ మందికి ప్రమోషన్లు కల్పించిందన్నారు. ఏ, బీ, సీ గ్రేడ్ ప్రమోషన్ల కోసం పరీక్షలకు హాజరైన వారందరికీ ఖాళీలతో సంబంధం లేకుండా టైం బాండ్ ప్రకారం ప్రమోషన్లు కల్పించాలని అన్నారు. బ్రాంచి ఉపాధ్యక్షుడు బయ్యమొగిలి, ఆర్గనైజింగ్ కార్యదర్శి సముద్రాల ఆనంద్, ఫిట్ కార్యదర్శి మారం శ్రీనివాస్, నాయకులు రఘునాథ్‌రెడ్డి, పుట్ట అంజయ్య, ఈపీ ఆపరేటర్లు పాల్గొన్నారు.

ఇద్దరు గంజాయి విక్రేతల అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ బన్సిలాల్

మంచిర్యాలక్రైం: జిల్లాకేంద్రంలో గంజాయి విక్రయించేందుకు వచ్చిన ఇద్దరిని అరెస్టు చేసినట్లు సీఐ బన్సిలాల్ తెలిపారు. స్థానిక పోలీసుస్టేషన్‌లో ఈ మేరకు సీఐ వివరాలు వెల్లడించారు. పక్కా సమాచారంతో సోమవారం స్థానిక గ్రీన్‌సిటీలో ఎస్సై సనత్‌కుమార్ నార్కోటిక్ టీమ్‌తో వెళ్లిన పోలీసు వాహనాన్ని చూసి ఇద్దరు పారిపోయేందుకు యత్నించగా పట్టుకున్నారు. మారుతినగర్‌కు చెందిన గోలివాడ సాయితేజ, మారుపల్లి సుకుమార్‌గా గుర్తించారు. వారి వద్ద నుంచి రూ.2 వేలు విలువ గల 35 గంజాయి ప్యాకెట్లు లభించాయి. మందమర్రి మండలం గద్దెరాగడికి చెందిన రాజు నుంచి గంజాయి కొనుగోలు చేసి అధిక ధరకు యువకులకు విక్రయించేందుకు వచ్చానని సాయితేజ ఒప్పుకున్నాడు. గంజాయిని స్వాధీనం చేసుకుని ఇద్దరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

పలు రూట్లలో బస్సులు నిలిపివేత

ఆదిలాబాద్: భారీ వర్షాల నేపథ్యంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఆర్టీసీ బస్సులు సోమవారం తాత్కాలికంగా రద్దయ్యాయి. ఆదిలాబాద్ నుంచి ఒంగోలు, గుంటూరు వెళ్లే సర్వీసును ఖమ్మం వరకు మాత్రమే నడుపుతున్నట్లు ఆదిలాబాద్ ఆర్ఎం సోలోమన్ తెలిపారు. అదేవిధంగా మంచిర్యాల–జగిత్యాల మధ్య నడిచే 5 సర్వీసులు, భైంసా పరిధిలో ఓలా, నిగ్వా వంటి రూట్లలో తాత్కాలికంగా బస్సులు నిలిపివేసినట్లు పేర్కొన్నారు. ప్రయాణికులు గమనించాలని కోరారు.

పనిస్థలాలు పరిశీలించిన ఏఐటీయూసీ నేతలు



ఆర్కే 7 గనిలో దిగుతున్న నాయకులు

శ్రీరాంపూర్: గుర్తింపు సంఘం ఏఐటీయూసీ నాయకులు సోమవారం ఆర్కే 7 గనిలో దిగి పని స్థలాలను పరిశీలించారు. యూనియన్ బ్రాంచి సెక్రటరీ ఎస్కే బాజీసైదా, ఉపాధ్యక్షుడు కొట్టే కిషన్‌రావు తదితరులు గనిలోని 2ఏఎస్ సౌత్ ప్యానల్‌లో దిగి కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గనిలో వెంటిలేషన్ సమస్య ఉందని, సరిపడా గాలిని అందించాలని వారు నేతలకు తెలిపారు. అనంతరం ఏఐటీయూసీ నేతలు ఏజెంట్ రాముడు, మేనేజర్ తిరుపతిని కలిసి సమస్యలను వివరించారు. వెంటనే వెంటిలేషన్ మెరుగుపర్చాలన్నారు. గని జీవితకాలం పెరగాలంటే సౌత్ సైడ్ ఉన్న బొగ్గు నిక్షేపాలను వెలికితీయాలన్నారు. దీంతో మరో 15 ఏళ్ల వరకు గని కొనసాగుతుందన్నారు. దీనిపై యాజమాన్యం చర్యలు తీసుకోవాలని కోరారు. యూనియన్ బ్రాంచి సహాయ కార్యదర్శి ఎం.కొమురయ్య, ఫిట్ సెక్రెటరీ బీర రవీందర్, మైనింగ్ స్టాఫ్ నాయకులు పారుపల్లి రాజేందర్ తదితరులు ఉన్నారు.

35 శాతం లాభాల వాటా చెల్లించాలి



ఆర్కే 7 గని మేనేజర్‌కు వినతిపత్రం ఇస్తున్న సురేందర్‌రెడ్డి

శ్రీరాంపూర్: సింగరేణి గడిచిన ఆర్థిక సంవత్సరం సాధించిన వార్షిక లాభాలను వెంటనే ప్రకటించి, అందులో నుంచి 35 శాతం లాభాల వాటాను కార్మికులకు చెల్లించాలని టీబీజీకేఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆ యూనియన్ ఆధ్వర్యంలో అన్ని గనులపై నిరసనలు తెలిపి గని మేనేజర్లకు వినతిపత్రాలు అందజేశారు. ఆర్కే 7 గనిపై జరిగిన కార్యక్రమంలో టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. వార్షిక సంవత్సరం ముగిసి 6 నెలలవుతున్నా ఇప్పటికీ కంపెనీ ఎంత లాభం వచ్చిందో ప్రకటించలేదన్నారు. విద్యాసంస్థలు ప్రారంభమైనందున కార్మికులకు ఖర్చులు అధికంగా ఉన్నాయని, వెంటనే లాభాలు ప్రకటించి వాటా చెల్లించాలని డిమాండ్ చేశారు. రాజునాయక్, బిరుదు శ్రీనివాస్, సిద్దం తిరుపతి, రాజలింగు ఉన్నారు. ఆర్కే 6 గనిపై జరిగిన కార్యక్రమంలో యూనియన్ చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పొగాకు రమేశ్, సెంట్రల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ అన్వేష్‌రెడ్డి, నాయకులు పానుగంటి సత్తయ్య, రాంటెంకి మల్లయ్య, ఎస్సార్పీ 3, 3ఏ గనిపై వద్ద యూనియన్ నాయకులు గోపి నాయక్, సాధుల భాస్కర్, వెంకటరెడ్డి, సతీశ్, రాజేశం పాల్గొన్నారు.

నిబంధనలకు అనుగుణంగా పనిచేయాలి



డ్రైవర్లతో మాట్లాడుతున్న ఇన్‌చార్జి జీఎం శ్రీనివాస్

శ్రీరాంపూర్: కంపెనీలో కాంట్రాక్ట్ కన్వేయన్స్ డ్రైవర్లు సంస్థ నిబంధనల మేరకు పనిచేయాలని శ్రీరాంపూర్ ఇన్‌చార్జి జీఎం టి.శ్రీనివాస్ తెలిపారు. డ్రైవర్లు వారి డిమాండ్ల సాధన కోసం ఇటీవల యాజమాన్యానికి సమ్మె నోటీసు అందించారు. సోమవారం జీఎం కార్యాలయంలో వారితో జీఎం సమీక్ష సమావేశం నిర్వహించారు. డ్రైవర్లకు నిబంధనల మేరకు వేతనాలు చెల్లించాలన్నారు. కంపెనీ నియమాల ప్రకారం సీఎంపీఎఫ్ చెల్లించాలని పేర్కొన్నారు. పని గంటల సమస్యలపై త్వరలో చర్చించి పరిష్కరిస్తామన్నారు. ఏరియా ఎస్ఓటూ జీఎం ఎం.సత్యనారాయణ, ఏజీఎం ఫైనాన్స్ మురళీధర్, డీజీఎం పర్సనల్ అరవిందరావు, పర్చేజ్ అధికారి చంద్రశేఖర్, ఏజెంట్ శ్రీధర్, క్వాలిటీ మేనేజర్ వెంకటేశ్వర్‌రెడ్డి, సెక్యూరిటీ అధికారి మురళీమోహన్, డిప్యూటీ పర్సనల్ మేనేజర్ దేవేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఏరియాలో 76 శాతం బొగ్గు ఉత్పత్తి

- ఆర్కే ఓసీలో 162శాతం.. శాంతిఖనిలో 48శాతం బొగ్గు ఉత్పత్తి



వివరాలు వెల్లడిస్తున్న జీఎం దేవేందర్

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలో గత నెల 76శాతం బొగ్గు ఉత్పత్తి జరిగిందని ఏరియా జీఎం దేవేందర్ తెలిపారు. జీఎం ఆఫీస్ ఆవరణలోని కాన్ఫరెన్స్ హాల్లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఉత్పత్తి వివరాలు వెల్లడించారు. కేకే–5 గనిలో 13,165టన్నులు, కాసిపేట గనిలో 13,355 టన్నులు, కాసిపేట–2 గనిలో 9,779టన్నులు, శాంతిఖనిలో 4,814టన్నులు, కేకే–ఓసీలో 72,810టన్నులు, ఆర్కే ఓసీలో 76,085టన్నుల ఉత్పత్తి జరిగిందని పేర్కొన్నారు. ఏరియాలో గైర్హాజరు ఉద్యోగులు ఎక్కువగా ఉన్నారని, వారు విధులు సక్రమంగా నిర్వహించాలని సూచించారు. రక్షణ సూత్రాలు పాటిస్తూ ఏరియా ఉద్యోగులంతా సమష్టిగా కృషి చేయాలని కోరారు. సమావేశంలో ఎస్వోటు జీఎం రాజేశ్వర్‌రెడ్డి, డీజీఎం వెంకటరమణ, ఐఈడీ రాజన్న, ఇన్‌చార్జి పీఎం మైత్రేయబంధు తదితరులు ఉన్నారు.

రైల్వేకాలనీలో వరదనీరు నిల్వకుండా చర్యలు

బెల్లంపల్లి: బెల్లంపల్లి కాల్‌టెక్స్ ఏరియా రైల్వే కాలనీ సమీపంలో వరద నీరు నిల్వకుండా సోమవారం చర్యలు తీసుకున్నారు. భారీ వర్షాలకు తోడు జాతి కుంట నుంచి వరదనీరు వస్తుండటంతో లోతట్టు ప్రాంతంలో నీరు నిలిచి పరిసర ప్రాంతాల ఇళ్లలోకి వెళ్తుండటంతో కట్టడి చర్యలకు ఉపక్రమించారు. ఆర్డీవో హరికృష్ణ, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావుతో కలిసి మున్సిపల్ చైర్ పర్సన్ శ్వేత రైల్వే అధికారులు, సిబ్బందితో మాట్లాడారు. జాతి కుంట చెరువు నుంచి వరద ప్రవాహం రాకుండా నీటి మళ్లింపు చర్యలు తీసుకోవాలని సూచించారు. జేసీబీతో తాత్కాలింగా వరదనీరు వెళ్లేలా చర్యలు తీసుకున్నారు. తహసీల్దార్ జ్యోత్స్న, మాజీ కౌన్సిలర్ నెల్లి రమేశ్, అధికారులు, బస్తీవాసులు పాల్గొన్నారు.

ఎందుకు బిడ్డా..ఇంతపని చేసుకున్నరు..!

- పండుగకు వస్తరని కొత్త బట్టలు తెచ్చిన..
- తల్లిదండ్రుల రోదనలు వర్ణనాతీతం
- కన్నీటి మధ్య ముగిసిన అంత్యక్రియలు
- మృతుల కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ



మృతదేహాల వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు, బంధువులు



వెంకటేష్ తల్లి రాజేశ్వరిని ఓదార్చుతున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు

మంచిర్యాలక్రైం: ''ఎందుకు బిడ్డా ఇంత పని చేసుకున్నరు.. మేమున్నం. ఎన్ని అప్పులున్నా తీర్చుకుందామని చెప్పితిమి కదా.. బిడ్డా పిల్లలు ఏం పాపం చేశారు. ఎందుకిలా చేశావు..'' అంటూ ఆ తల్లి రోదించిన రాజేశ్వరి తీరు కాలనీ వాసులను కంటతడి పెట్టించింది. మంచిర్యాల పట్టణంలోని రెడ్డి కాలనీకి చెందిన సింగరేణి రిటైర్డు ఉద్యోగి ఇప్ప కొమురయ్య, రాజేశ్వరి దంపతుల కుమారుడు వెంకటేష్ ఆన్‌లైన్ బెట్టింగ్‌తో అప్పుల పాలు కావడం, వెంకటేష్ శనివారం రాత్రి తన భార్య, ఇద్దరు పిల్లలకు విషమించి తానూ ఆత్మహత్య చేసుకోవడం తెలిసిందే. వెంకటేష్, అతడి భార్య వర్షిణి, కుమారులు రిషికాంత్(11), విహాంత్(3) మృతదేహాలు సోమవారం ఉదయం మంచిర్యాలలోని ఇంటికి తీసుకొచ్చారు. ఇంటి ఎదుట నలుగురి మృతదేహాలను వరుసగా ఉంచిన తీరుతో స్థానికులు కంటతడి పెట్టారు. చివరి చూపు కోసం బంధువులు, కాలనీ ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. కాలనీ మొత్తం విషాదఛాయలు అలుముకున్నాయి. ''గణేష్ పండుగకు వస్తరని కొత్త బట్టలు తెచ్చిన బిడ్డా..'' అంటూ వర్షిణి తల్లి పద్మ రోదించిన తీరు అక్కడున్నవారిని ఆవేదనకు గురి చేసింది. మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు, బీఆర్ఎస్ నాయకులు, స్థానిక కాంగ్రెస్ కౌన్సిలర్ సంజీవ్.. మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించారు.

అంత్యక్రియలకు ఆటంకం

మంచిర్యాల పట్టణంలో ఎవరు చనిపోయినా అంత్యక్రియలకు గోదావరి నదీ తీరంలోనే నిర్వహిస్తారు. ఇటీవల కురిసిన భారీ వర్షానికి నది ఉధృతంగా ప్రవహిస్తుండడంతో అంత్యక్రియలకు స్థలం లేకుండా పోయింది. దీంతో అండాలమ్మ కాలనీ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు.

మద్యం షాపులో చోరీ



షాప్‌ను పరిశీలిస్తున్న సీఐ సుధాకర్

కోటపల్లి: మండలంలోని పార్‌పల్లి గ్రామంలోని మద్యం షాపులో గుర్తుతెలియని వ్యక్తులు ఆదివారం అర్ధరాత్రి చోరీకి పాల్పడ్డారు. సోమవారం ఉదయం అటుగా వెళ్తున్న వారు చూసి నిర్వాహకులకు సమాచారం అందించారు. వారు వచ్చి చూడగా షాపు వెనుక భాగాన తలుపు పగులగొట్టి ఉంది. షాపులో రూ.1.50 లక్షల విలువ గల మద్యం బాటిళ్లు, కౌంటర్‌లో రూ.34 వేల నగదును దొంగలు ఎత్తుకెళ్లారని నిర్వాహకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటన స్థలాన్ని సీఐ సుధాకర్, ఎస్సై రాజేందర్ పరిశీలించారు. షాపులో సీసీ కెమెరాలు ధ్వంసం చేసి రికార్డు చేసే బాక్స్ ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. నిందితులు షాప్ వద్దకు ఆటోలో మద్యం బాటిళ్లతో ఉడాయించినట్లు అనవాళ్లు గుర్తించగా జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను పరిశీలించారు. అనుమానితుడిని అదుపులో తీసుకున్నట్లు సమాచారం.

కులగణన కోసం ఒకరోజు దీక్ష



పోలీస్‌స్టేషన్‌లో దీక్ష చేస్తున్న శంకర్

లక్సెట్టిపేట: బీసీ రిజర్వేషన్ కులగణన చేపట్టాలని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ హనుమాండ్ల శంకర్ సోమవారం ఒకరోజు దీక్ష చేపట్టాడు. స్థానిక అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి తెలంగాణ తల్లి, ఐలమ్మ విగ్రహాలకు పూలమాలలు వేసి దీక్ష ప్రారంభించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సాయంత్రం వరకు దీక్షలో కూర్చున్నారు. పలువురు నాయకులు ఆయనకు సంఘీభావం తెలిపారు.

ముగిసిన ఖేల్‌ఖూద్ పోటీలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న అతిథులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం కర్ణమామిడి గ్రామం చొక్కారాంనగర్ రాంపూర్ శ్రీవిద్యారణ్య ఆవాస విద్యాలయంలో మూడు రోజులపాటు నిర్వహించిన ప్రాంత స్థాయి (రాష్ట్ర స్థాయి) క్రీడా పోటీలు సోమవారం ఘనంగా ముగిశాయి. ముఖ్య అతిథిగా హాజరైన విద్యాభారతి దక్షిణ మధ్య క్షేత్ర అధ్యక్షుడు డాక్టర్ చామర్తి ఉమామహేశ్వర్‌రావు మట్లాడుతూ సరస్వతీ శిశు మందిరాలు విద్యార్థులు చదువుల్లోనే కాకుండా క్రీడల్లోనూ రాణించేలా చక్కని ప్రోత్సాహాన్ని ఇస్తున్నాయని అన్నారు. పోటీల్లో గెలుపోటములు సహజమని, క్రీడాకారులుగా నిరంతరం సాధన చేస్తేనే భవిష్యత్‌లో క్రీడల్లో అభ్యున్నతి సాధిస్తారని తెలిపారు. విజేతలకు పతకాలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ముగింపు వేడుకల్లో లక్సెట్టిపేట మున్సిపల్ చైర్మన్ నలమాసు కాంతయ్య, రాంపూర్ ఆవాస విద్యాలయం పూర్వ విద్యార్థి పరిషత్ ఉపాధ్యక్షుడు పూస్కూరి శ్రీనివాసరావు, గౌరవ కార్యదర్శి సాగి ప్రభాకర్‌రావు, శ్రీసరస్వతీ విద్యాపీఠం తెలంగాణ సంఘటనా కార్యదర్శి పతకమూరి శ్రీనివాసరావు, మంచిర్యాల విభాగ్ అధ్యక్షుడు డాక్టర్ కే.విష్ణువర్ధన్‌రావు, ఖేల్‌ఖూద్ ప్రబంధకులు పాల్గొన్నారు. కాగా రాష్ట్ర స్థాయి పోటీల్లో విజయం సాధించిన క్రీడాకారులు త్వరలో కర్ణాటకలో జరిగే క్షేత్ర(జాతీయ) స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు.

‘అడ’ 5, ‘వట్టి’ 3 ప్రాజెక్టుల గేట్లు ఎత్తివేత



అడ ప్రాజెక్టు నుంచి దిగువకు వెళ్తున్న నీరు

ఆసిఫాబాద్‌రూరల్: అడ, వట్టివాగు ప్రాజెక్టుల గేట్లు ఎత్తి అధికారులు సోమవారం నీటిని దిగువకు వదులుతున్నారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు నీరు చేరడంతో అడ ప్రాజెక్టు ఐదు గేట్లు 1 మీటర్‌పై ఎత్తి 10,485 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. పూర్తిస్థాయి నీటిమట్టం 10.393 టీఎంసీలు (243 మీటర్లు) కాగా, ప్రస్తుతం 5.809 టీఎంసీలు వాటర్ లెవల్ 237.450 మీటర్లుగా ఉంది. ప్రాజెక్ట్‌కు ఇన్ ఫ్లో ద్వారా 12580 క్యూసెక్కులు కాగా ఐదు గేట్లు ఎత్తి 10,485 నీటిని వదిలారు. వట్టివాగు ప్రాజెక్టు మూడు గేట్లు 2.80 మీటర్‌పై ఎత్తి 10,080 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 2.89 టీఎంసీలు (238.50 మీటర్లు) ప్రస్తుతం 2.442 టీఎంసీలు కాగా, ఇన్ ఫ్లో ద్వారా వచ్చిన 5470 క్యూసెక్కులు నీటిని దిగువకు వదులుతున్నారు.